


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జనవరి 10 2025 సంపుటి :0 సంచిక : 89 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4

## సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు తెలంగాణ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 13 నుంచి 23 వరకు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు అనుమతించింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తన పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. బ్రిస్బేన్, దావోస్, ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇందుకోసం ఆరు నెలల పాటు తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్ధనను అంగీకరించిన న్యాయస్థానం.. జులై 6లోగా పాస్‌పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది.

## ఫార్ములా-ఈ రేసు కేసు.. ఈడీ విచారణకు హాజరైన అర్వింద్‌కుమార్



హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ హాజరయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఆయన వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో) సంస్థకు రూ.45.71 కోట్ల బదిలీపై అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు భావిస్తున్నారు. ఆ కోణంలో అర్వింద్‌కుమార్‌ను విచారిస్తున్నట్లు సమాచారం.

## మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట

దిల్లీ: సినీనటుడు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.

జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం సినీనటుడు మోహన్‌బాబు ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మోహన్‌బాబు దాఖలుచేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను గత నెల 23న తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. దాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



## తిరుమల వైకుంఠద్వార దర్శనం.. తొలి మూడు రోజులకు టోకెన్ల జారీ పూర్తి



తిరుపతి: వైకుంఠద్వార దర్శనానికి సంబంధించి తితిదే టోకెన్ల జారీని పూర్తి చేసింది. తొలి మూడు రోజులకు 1.20లక్షల టోకెన్లను జారీ చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 9 గంటల వరకు ఈ కోటాను పూర్తి చేసింది. వైకుంఠద్వార దర్శనం కోసం రోజుకు 40వేల టోకెన్ల చొప్పున (%ుణ చీవ్ఙం%) జారీ చేశారు. వీటిని కలిగిన భక్తులను మాత్రమే 10, 11, 12 తేదీల్లో అనుమతించనున్నారు. 13 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద వైకుంఠ ద్వార దర్శన టికెట్లను ఏరోజుకారోజు ఇవ్వనున్నారు.

## చామల కిరణ్ రెడ్డి లాంటి బ్రోకర్లకు కేటీఆర్ గురించి మాట్లాడే అర్హత లేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు కేసులు పెట్టింది. కేటీఆర్ ఏసీబీ విచారణకు వెళ్తే కాంగ్రెస్ నేతలు శునకానందం పొందుతున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్

2లో

## 'భూ భారతి'కి గవర్నర్ ఆమోదం..

### మెరుగైన రెవెన్యూ సేవలందిస్తాం: మంత్రి పొంగులేటి

- 'భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర పడటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.
- గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు.
- ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.
- చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.



2లో

## మహా కుంభమేళాకు వెళ్తున్నారా..? మీ కోసమే ఐఆర్‌సీటీసీ స్పెషల్ ప్యాకేజీ..!

- త్వరలోనే ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా మొదలవనున్నాయి.
- జనవరి 13న సంక్రాంతి సందర్భంగా మొదలై.. దాదాపు 45 రోజుల పాటు సాగనున్నది.
- ఈ కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి త్రివేణి సంగమంలో స్నానాలు చేయనున్నారు.



2లో

ఈ సారి ఉత్సవానికి ఈ సారి దాదాపు 40కోట్ల మందికిపైగా వస్తారని అంచనా. ప్రయాగ్‌రాజ్‌లో జరిగే ఈ మహా కుంభమేళాకు మీరు కూడా వెళ్లానుకుంటున్నారా..? అయితే, మీకో గుడ్‌న్యూస్. ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు హాజరవడంతో పాటు వారణాసిలో కొలువైన కాశీ విశ్వేశ్వరుడు,



## ఆరున్నర గంటల పాటు కేటీఆర్‌ను విచారించిన ఏసీబీ

- ఫార్ములా-ఈ రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ను ఏసీబీ అధికారులు 6.30 గంటల పాటు విచారించారు.
- ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. కేటీఆర్‌ను విచారించారు.
- ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు.
- విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు.
- ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు.

2లో

## రిటైర్డ్ జాగిలాలను ప్రజలు దత్తత తీసుకోవచ్చు: సీఆర్పీఎఫ్



### రిటైర్డ్ జాగిలాలను సామాన్యులు దత్తత తీసుకునేందుకు వీలుగా సీఆర్పీఎఫ్ తొలిసారి ఆన్‌లైన్ సేవలు ప్రారంభించింది.

దిల్లీ: దేశ రక్షణలో భాగమై ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న జాగిలాల విషయంలో సీఆర్పీఎఫ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వీటిని ప్రజలు దత్తత తీసుకునేలా వీలు కల్పిస్తోంది. అందుకు వీలుగా ఆన్‌లైన్ సేవలను ప్రారంభించింది. సాధారణంగా కేంద్ర, రాష్ట్రాల పోలీసులు తమ వద్ద రిటైర్డ్ అయిన శునకాలను.. సంరక్షణ కేంద్రాలు, రిజిస్టర్డ్ ఎన్‌జీవో, పలు ప్రఖ్యాత సంస్థలకు అప్పగిస్తుంటారు. దేశరక్షణ కోసం పని చేసిన వీటిని సంరక్షణ కేంద్రాల్లో వదిలేయకుండా.. ప్రజలకు దత్తత ఇచ్చేందుకు సీఆర్పీఎఫ్ సిద్ధమైంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

దాదాపు 8 నుంచి 12 ఏళ్ల వయసున్న ఈ జాగిలాలు దేశవ్యాప్తంగా నక్సల్ వ్యతిరేక, ఉగ్రవాద వ్యతిరేక సాహస కార్యకలాపాల్లో పాల్గొన్నాయి. అయితే.. వీటిని ఇతరులకు అప్పగించినట్లయితే దేశ వ్యతిరేక కార్యాలకు ఉపయోగిస్తారనే అనుమానాలు ఉండడంతో ఇన్నాళ్లూ దత్తతకు ఇవ్వలేదని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. కానీ, ప్రస్తుతం వీటిని దత్తత తీసుకోవాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి.

దీని ప్రకారం.. దత్తత తీసుకున్న జాగిలాలను దుర్వినియోగం చేయకూడదు. వాటిని విక్రయించడం, ఇతరులకు హాని కలిగించడం చేయకూడదు. ఇలా దత్తత తీసుకునే వ్యక్తి ఒప్పంద పత్రంపై సంతకం చేయాల్సి ఉంటుంది. శునకం ఆరోగ్యం, టీకా ఇలా దానికి సంబంధించిన వివరాలను అందిస్తారు. బెల్జియన్ షెఫర్డ్ మాలినోయిస్, జర్మన్ షెఫర్డ్, లాబ్రడార్, ముధోల్ హౌండ్ జాతులకు చెందిన 30 రకాల కుక్కలను ప్రజలకు ఇచ్చేందుకు సీఆర్పీఎఫ్ సిద్ధమైంది.

# 'భూ భారతి'కి గవర్నర్ ఆమోదం..

## మెరుగైన రెవెన్యూ సేవలందిస్తాం: మంత్రి పొంగులేటి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. గ్రామాలలో రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇప్పటికే కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని.. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు.

**ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్ సైట్**

ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదులకు ఏర్పాటు చేసిన https://indirammaindlu.telangana.gov.in ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్‌ఎంసీలో 88శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి వివరించారు.

## చామల కిరణ్ రెడ్డి లాంటి బ్రోకర్లకు కేటీఆర్ గురించి మాట్లాడే అర్హత లేదు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు కేసులు పెట్టింది. కేటీఆర్ ఏసీబీ విచారణకు వెళ్తే కాంగ్రెస్ నేతలు శునకానందం పొందుతున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రసన్నం కోసం భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి చిల్లరమల్లర మాటలు మాట్లాడుతున్నారు. చామల కిరణ్ రెడ్డి లాంటి బ్రోకర్లు కేటీఆర్ గురించి మాట్లాడే అర్హత లేదని ఘాటుగా విమర్శించారు.

చామల కిరణ్ రెడ్డి పేమెంట్ కోటాలో రాజకీయాల్లోకి వచ్చి ఎంపీ అయ్యారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ పని చేసి పదేళ్లు మంత్రి అయ్యారు . చామల కిరణ్ రెడ్డి రేవంత్ రెడ్డి మోచేతి నీళ్లు తాగి ఎంపీ అయ్యాడని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక లక్షా 37 వేల కోట్లు అప్పుల్లో ఎవరి వాటా ఎంతో చెప్పాలన్నారు. రాష్ట్రం కోసం కాంగ్రెస్ ఎంపీలు ఒక్క రోజు ప్రెస్ మీట్ పెట్టలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో చామల కిరణ్ రెడ్డి ఎక్కడ ఉన్నాడని సూటిగా ప్రశ్నించారు. క్విడ్ ప్రో కో అంటే తెలియని వాళ్లు కూడా చిల్లరమల్లరగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కేటీఆర్ పై కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. కేటీఆర్ ను తిట్టి వార్తల్లో ఉండాలని అనుకుంటున్నారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవిని కొనుక్కున్నారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో కాంట్రాక్టులు చేసేది ఎవరు? మీకు వచ్చే వాటాలు ఎంత? అని నిలదీశారు. ఫార్ములా ఈ కేస్ శుద్ధ అబద్ధం. కేటీఆర్ విచారణపై లీకులు ఇస్తున్నారు. మాకు న్యాయ వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ఫార్ములా ఈ కేసులో కేటీఆర్ క్లిన్ చిట్‌తో బయటకు వస్తారని స్పష్టం చేశారు.

## ఆరున్నర గంటల పాటు కేటీఆర్‌ను విచారించిన ఏసీబీ

మొదటిపేజీ తరువాయి

ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా. నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. ప్రభుత్వ ఒత్తిడిలో మీరు ఏం చేస్తున్నారో కూడా తెలియడంలేదని అధికారులకు చెప్పాను. ఒక్క ప్రశ్ననే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు ఇక్కడి నుంచి పంపిచామని చెబుతున్నా.. పైసలు ఇక్కడున్నాయని వాళ్లు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా" అని కేటీఆర్ తెలిపారు.

## మహా కుంభమేళాకు వెళ్తున్నారా..? మీ కోసమే ఐఆర్‌సీటీసీ స్పెషల్ ప్యాకేజీ..!

మొదటిపేజీ తరువాయి

అయోధ్య రామయ్య దర్శనం చేసుకునే వీలు కల్పిస్తున్నది ఐఆర్‌సీటీసీ టూరిజం. కుంభమేళా సందర్భంగా 'మహా కుంభ్ పుణ్య క్షేత్ర యాత్ర' పేరుతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. మహా కుంభ్ యాత్రలో పర్యటన ఎనిమిది రోజులు, ఏడు రాత్రులు సాగుతుంది. జనవరి 20న ప్రారంభమవుతుంది.

యాత్ర ఇలా మొదలు..

కుంభ్ యాత్ర టూరిజం ప్రత్యేక ప్యాకేజీలో పర్యటన సికింద్రాబాద్ నుంచి మొదలవుతుంది. 20న మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లో భారత్ గౌరవ్ రైలు బయలుదేరుతుంది. ప్యాకేజీలో భాగంగా కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండి, తుని, దువ్వాడ, విజయనగరం, కుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, టాటానగర్ మీదుగా ప్రయాణం సాగుతుంది. మూడురోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకు రైలు బెనారస్ చేరుకుంటుంది. రైల్వేస్టేషన్ నుంచి హోటల్‌కు చేరుకుంటారు. సాయంత్రం గంగాహారతిని వీక్షిస్తారు. రాత్రి వారణాసిలోనే బస ఉంటుంది. ఇక నాలుగో రోజు బ్రేక్‌ఫాస్ట్ చేసుకొని వారణాసి నుంచి రోడ్డు మార్గం ద్వారా ప్రయాగ్‌రాజ్ బయలుదేరి వెళ్తారు. ప్రయాగ్‌రాజ్ చేరుకున్న తర్వాత సొంత ఖర్చులు భరించి కుంభమేళా జరిగే స్థలానికి వెళ్తారు. రాత్రి ప్రయాగ్‌రాజ్‌లోనే బస ఉంటుంది. ఐదోరోజు మళ్లీ ప్రయాగ్‌రాజ్‌నుంచి రోడ్డు మార్గం ద్వారా వారణాసికి చేరుకుంటారు. ఆ తర్వాత కాశీ విశ్వేశ్వరుడు, అన్నపూర్ణ అమ్మవార్ల దర్శనం ఉంటుంది. ఆ రోజు వారణాసి నుంచి మధ్యాహ్నం వరకు అయోధ్యకు చేరుకుంటారు. రామ్ మందిర్, హనుమాన్ ఘర్హిలో దర్శనాలు చేసుకొని రాత్రి తిరిగి ప్రయాణం మొదలవుతుంది. డిన్నర్ రైలులోనే ఉంటుంది. ఏడోరోజు టాటానగర్, బాలాసోర్ మీదుగా రైలు ప్రయాణం ఉంటుంది. ఎనిమిదో రోజుఉదయం 8 గంటలకు విజయనగరం చేరుతుంది. సికింద్రాబాద్‌కు రాత్రి 11.30 గంటలకు రైలు చేరుకుంటుంది. దాంతో ప్యాకేజీలో పర్యటన ముగుస్తుంది.

ప్యాకేజీ ధరలు ఇవీ..

ఐఆర్‌సీటీసీ మహా కుంభ్ పుణ్యక్షేత్ర యాత్రలో మూడు ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ఎకానమీ, స్టాండర్డ్ (థర్డ్ ఏసీ), కంఫర్ట్ (2ఏసీ)లో ప్రయాణం ఉంటుంది. ఎకానమీ క్లాస్ ప్యాకేజీ ధర రూ.22635, ఐదునుంచి 11ఏళ్లలోపు పిల్లలకు రూ.21,740గా ధర నిర్ణయించారు. థర్డ్ ఏసీలో ధర రూ.31,145, పిల్లలకు రూ.30,095.. సెకండ్ ఏసీలో ధర రూ.38,195.. పిల్లలకు రూ.39,935గా నిర్ణయించింది. రైలులో మొత్తం 271 సీట్లు ఉండగా.. 105 స్లీపర్, 116 థర్డ్ ఏసీ, 50 సెకండ్ ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ఎకానమీ క్లాస్ పర్యాటకులకు నాన్ ఏసీ గదుల్లో వసతి, నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణం ఉంటుంది. స్టాండర్డ్ కేటగిరిలో పర్యాటకులకు ఏసీ గదుల్లో వసతి, నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణం ఉంటుంది. కంఫర్ట్ కేటగిరిలోని పర్యాటకులకు ఏసీ గదుల్లో వసతి, ఏసీ వాహనాల్లోనూ ప్రయాణం కల్పిస్తారు. ప్యాకేజీలో మార్నింగ్ టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌తో పాటు వసతి ఉంటుంది. పర్యాటకులకు ఇన్సూరెన్స్ సైతం వర్తిస్తుంది. వివరాలకు %ఱతీష్‌షిశీబతీఱంఎ.ఇశీఎ%లో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ కోరింది.

## బూతులు మాట్లాడే పార్టీకి ప్రజలు ఓటెయ్యరు: ఆతిశీ

బూతులు మాట్లాడేవారిని, ఆ పార్టీని ప్రజలు ఎన్నుకోబోరని, ఎవరైతే తమ కోసం పని చేస్తారో వాళ్లకే ఓటు వేస్తారని దిల్లీ సీఎం ఆతిశీ అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే విషయాన్ని పదేపదే చెబుతారని ఆమె గుర్తు చేసుకున్నారు.

దిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు విమర్శలకు పదునుపెడుతున్నాయి. ముఖ్యంగా సీఎం ఆతిశీ .. ప్రతిపక్ష భాజపాపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. రాబోయే ఎన్నికలు ఆమ్ ఆద్మీపార్టీకి, దుర్భాషలాడే సమూహానికి మధ్య జరుగుతున్నాయని భాజపాని ఉద్దేశించి ఆమె అన్నారు. తనని, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకొని భాజపా విమర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. 'ఆతిశీ తన తండ్రిని మార్చేశారు' అంటూ ఇటీవల భాజపా మాజీ ఎంపీ రమేశ్ బిధూడీ చేసిన వ్యాఖ్యలను ఆమె ప్రస్తావించారు. బూతులు మాట్లాడేవారిని, ఆ పార్టీని ప్రజలు ఎన్నుకోబోరని, ఎవరైతే తమ కోసం పని చేస్తారో వాళ్లకే ఓటు వేస్తారని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే విషయాన్ని పదేపదే చెబుతారని ఆమె గుర్తు చేసుకున్నారు.

దిల్లీ అభివృద్ధిపై భాజపాకు ఓ విజన్ లేదని ఆతిశీ అన్నారు. ఆ పార్టీ అధికారంలోకి రాదు కాబట్టే.. ముఖ్యమంత్రి అభ్యర్థిని కూడా ప్రకటించలేదని ఎద్దేవా



చేశారు. " ఆప్ ప్రజల కోసం పని చేసింది. భవిష్యత్‌లోనూ చేస్తుంది. భాజపాకి ఓ అజెండా లేదు. ముఖ్యమంత్రి అభ్యర్థి కూడా లేరు. వాళ్లకి తెలిసిందల్లా ఒక్కటే.. అరవింద్ కేజ్రీవాల్‌ను దూషించడం. ఎవరిని ఎన్నుకోవాలన్న దానిపై దిల్లీ ప్రజలు సులభంగానే నిర్ణయం తీసుకుంటారని అనుకుంటున్నా" అని ఆతిశీ పేర్కొన్నారు. ' సీఎం ఆతిశీ ఆమె తండ్రినే మార్చేశారు. గతంలో ఆమెకు ఒక ఇంటి పేరు ఉండగా.. ప్రస్తుతం మరో పేరును వినియోగిస్తున్నారు. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డ అఫ్జల్ గురుకు క్షమాభిక్ష ప్రసాదించాలంటూ ఆమె తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు" అంటూ భాజపా నేత రమేశ్ బిధూడీ ఆరోపించిన సంగతి తెలిసిందే.

భాజపా మేనిఫెస్టోపై ఉత్కంఠ!

ఆప్‌ని ఎలాగైనా గద్దె దించాలనుకుంటున్న భాజపా విడుదల చేయబోతున్న మేనిఫెస్టోపై ఉత్కంఠ నెలకొంది. అన్ని వర్గాల వారిని ఆకర్షించేలా ఎన్నికల ప్రణాళిక ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు నగదు సాయం, బస్సు, మెట్రోల్లో ఉచిత ప్రయాణం పథకాలను మేనిఫెస్టోలో చేర్చబోతున్నట్లు సమాచారం. గత ఎన్నికల్లో ఆప్ మళ్లీ అధికారంలోకి రావడానికి ఈ పథకాలే ప్రధాన కారణమయ్యాయి. ప్రస్తుతం 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు విధించడం లేదు. ఈ నేపథ్యంలో దానిని 300కి పెంచే యోచనలో భాజపా ఉన్నట్లు తెలుస్తోంది. దేవాలయాలు, గురుద్వారాలు ఉన్న ప్రాంతాల్లో 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన' దిల్లీ మహిళలకు అక్కడి ప్రభుత్వం ప్రతి నెలా రూ.1000 ఆర్థిక సాయం చేస్తోంది. మళ్లీ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని రూ. 2,100కి పెంచుతామని కేజ్రీవాల్ ఇటీవల హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో భాజపా ఎలాంటి ప్రకటన చేస్తుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో మహిళలకు నగదు బదిలీ పథకాలు కీలకంగా మారాయి. మహిళా ఓటు బ్యాంకును సాధించేందుకు దిల్లీలోనూ భాజపా ఈ తరహా వ్యూహాన్ని అమలు చేసే అవకాశముంది.

## 10% మేర తగ్గనున్న వరి, గోధుమల దిగుబడి - ఐఎండీ చీఫ్ హెచ్చరిక

ఇంటర్నెట్ డెస్క్: వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో వరి, గోధుమ దిగుబడులు 6–10 శాతం తగ్గిపోయే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. లక్షలాది మందికి ఆహార భద్రతపై ఇది ప్రభావం చూపనుందన్నారు. మరోవైపు తీర ప్రాంతాల్లో సముద్ర జలాలు వేడెక్కుతున్నాయని, దీంతో చేపలు తీరం నుంచి దూరంగా వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. ఫలితంగా చేపల వేటపైనా వాతావరణ మార్పులు తీవ్రంగా ఉంటుందన్నారు.

"వాతావరణ మార్పులతో వరి, గోధుమ ఉత్పత్తులు 6 నుంచి 10శాతం తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇది రైతులు, ఆహార భద్రతపై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది" అని డీజీ మృత్యుంజయ్ మహాపాత్ర (వెల్లడించారు. భూతాపం ప్రభావం కూడా ఉందన్నారు. దీంతో హిమాలయాలతోపాటు దిగువన మైదానాల్లో నివసిస్తున్న కోట్లాది మంది నీటి కొరతతో ఇబ్బందిపడుతారని భూశాస్త్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ ఆందోళన వ్యక్తంచేశారు. వాతావరణ మార్పుల ప్రభావంపై మృత్యుంజయ్, రవిచంద్రన్‌లు పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక అంశాలు

## జలమండలి అధికారులతో ఎండీ, ఈడీ సమీక్ష

హైదరాబాద్ జనవరి 9

వేసవిలో నీటి డిమాండ్ ను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్.. జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత వేసవిలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసుకున్న ప్రాంతాల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది ట్యాంకర్ బుకింగ్, నీటి సరఫరా, డెలివరీ తదితర వివరాలను పరిశీలించారు. ఈ సారి నీటి డిమాండ్ ను మరింత సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లు, నీటి మోతాదు పెంచుతామని చెప్పారు.




గతంలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసిన వినియోగదారులను సర్వే చేసి గుర్తించారు. వీరి ప్రాంగణాల్లో బోర్లు, భూగర్భ జలాలు ఎండిపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇలాంటి వినియోగదారుల ఇళ్లల్లో సర్వే చేపట్టామని తెలిపిన వారు.. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

అనంతరం వారు ట్యాంకర్ల యజమానులతో సమావేశమయ్యారు. వేసవిలో ట్యాంకర్ల పరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా.. కావాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్–2 స్వామి, సీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం జనవరి 10 2025

# బీరు పిట్ట బీరు పిట్ట తుర్రుమన్నది

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

సంక్రాంతి పండగ ముందు తెలంగాణ మందుబాబులకు బ్యాడ్‌న్యూస్. ఇక నుంచి తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్లు కనిపించవంట. తెలంగాణకు కింగ్ ఫిషర్ బీర్లు, హెనికిన్ బీర్ల సరఫరాను నిలిపేస్తున్నట్టు యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ ప్రకటించింది. తెలంగాణ బెవరేజస్ కార్పొరేషన్ తమ సంస్థకు బకాయిలు చెల్లించకపోవడం కారణంగానే బీర్ల సరఫరాను నిలిపేస్తున్నట్టు యునైటెడ్ బ్రూవరీస్ తెలిపింది. ఈ మేరకు.. సెబీకి యునైటెడ్ బ్రూవరీస్ లేఖ రాసింది.తెలంగాణ బెవరేజస్ కార్పొరేషన్ రూ.900 కోట్లు బకాయి ఉందని, 2019 నుంచి ధరలను సవరించకపోవడం లాంటి కారణాల వల్ల, భారీ నష్టాలు వస్తున్నాయని బ్రూవరీస్ తన లేఖలో వెల్లడించింది. బ్రూవరీస్ తీసుకున్న ఈ నిర్ణయంతో సంక్రాంతి పండగ ముందు.. రాష్ట్రంలోని కింగ్ ఫిషర్ బీర్ ప్రియుల బీరు బదులు నీరు పోసినట్టయింది.తెలంగాణలో మంచి అయినా, చెడు అయినా, బాధొచ్చినా, సంతోషం వచ్చినా,పండుగొచ్చినా పబ్బమొచ్చినా, చచ్చినా బతికినా, చివరికి ఎలక్షన్లు వచ్చినా.. ఇలా ఏ సందర్భమైనా ముందు మందుండాల్సిందే. తెలంగాణలో తాగటం అనేది అలవాటుపడిన ఓ సంప్రదాయమని దిల్ రాజు చెప్పినట్టు, చిన్నా పెద్దా




అందరూ తాగుతారన్నది బహిరంగ రహస్యమే. అయితే, వయసులో పెద్దవాళ్లు చాలా మంది ఎర్రమందు విస్కీ, బ్రాండీ, రమ్ లాంటి మద్యం సేవిస్తే.. యువత మాత్రం ఎక్కువగా తాగేది బీర్లే.అందులోనూ కింగ్ ఫిషర్ బ్రాండ్ బీర్లకు, మళ్లీ అందులో కింగ్ ఫిషర్ లైట్ బీర్లకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది.మార్కెట్‌లో ఎన్నో పేర్లతో బీర్లు లభ్యమవుతున్నా.. చాలా మందికి బీర్ అంటే చాలు కింగ్ ఫిషర్ బీరే మొదటగా గుర్తొస్తుంది. కొంత మందికైతే.. కింగ్ ఫిషర్ బీర్ తప్ప మిగతా బ్రాండ్ల పేర్లు కూడా సరిగా తెలియదంటే అతిశయోక్తి కాదు. అలాంటి ప్రజాధరణ పొందిన కింగ్ ఫిషర్ బీర్లు ఇప్పుడు మొత్తానికే రావు అనే వార్త.. చాలా మంది, మందు యుగపు దూతలను ఆందోళనకు, ఆవేదనకు గురిచేయనుంది.సంక్రాంతి పండగ ముందు తెలంగాణ మందుబాబులకు కాస్త ఆందోళన కలిగించే వార్తను ప్రకటించింది యూనైటెడ్ బ్రూవరీస్ కంపెనీ. తెలంగాణకు తక్షణమే కింగ్ ఫిషర్ బీర్లతో పాటు హీనెకెన్ బీర్ల సరఫరాను నిలిపేస్తున్నట్టు ప్రకటించటం ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. యునైటెడ్ బ్రూవరీస్ ప్రకటనపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. తమను ఏమాత్రం సంప్రదించకుండానే సరఫరా నిలివేస్తున్నామని బహిరంగంగా ప్రకటించటంపై సర్కార్ సీరియస్ అయ్యింది.రాష్ట్రంలో ప్రజాధరణ కలిగిన కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేస్తే, మద్యం ప్రియులు ఆందోళన చెందుతారని, ఇదే అదునుగా చేసుకుని బెల్ట్ షాపులు అధిక ధరలకు అమ్మడాలు, వైన్ షాపులు బీర్ల కృత్రిమ కొరత సృష్టించే అవకాశాలున్నాయని ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.ఈ క్రమంలోనే.. వైన్ షాపులకు రేవంత్ రెడ్డి సర్కార్ కఠిన ఆదేశాలు జారీ చేసింది. బ్రూవరీస్ ప్రకటన నేపథ్యంలో.. బీర్ల కృత్రిమ కొరత సృష్టించినట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మద్యం దుకాణాలకు హెచ్చరికలు జారీ చేసింది.

# ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన సదస్సు

**కరపత్రం నిజాంపేట్ ప్రతినిది..**

జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగు పై అవగాహన సదస్సు నిజాంపేట్ రైతు వేదికలో గురువారం రోజున నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ మండల వ్యవసాయ అధికారి సోమ లింగా రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయిల్ పామ్ విస్తరణ అధికారుల మండల రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, దీని వలన రెట్టింపు ఆదాయం పొందవచ్చని, ఒక ఎకరా వరి వేసే నీళ్ళతో 5 ఎకరాల ఆయిల్ పంట పండించవచ్చని, పైగా ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేని విధంగా చట్టం ద్వారా, ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సంబధిత కంపెనీ కొనుగోలు చేస్తారని, కోతుల బెడద లేని పంట కాబట్టి రైతులందరూ ముందుకు వచ్చి ఆయిల్ పంట సాగు చేపట్టాలని కోరడం జరిగినది. అంతే కాకుండా ఉద్యాన



శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు మొక్కలపై రాయితితో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణ అంతర పంటల సాగు కొరకు రాయితీ మొత్తంగా 26, 450 సొమ్మును రైతుల ఖాతాకు జమ చేయబడును.అదే విధంగా ఆయిల్ పామ్ సాగు కూలంకషంగా వివరిస్తూ ఎకరానికి 57 మొక్కలు, 9%ఇ%9 మీటర్ల దూరంలో త్రికోణ ఆకార పద్ధతి ద్వారా నాటుకోవచ్చు, ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరముల తరువాత ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వచ్చును. ప్రస్తుతం ఒక్క టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ. 20,000/-. ఈ లెక్కన సంవత్సరమునకు రూ. 2,00,000/- ఆదాయం వచ్చును. ఖర్చులు పోను ఒక ఎకరానికి సంవత్సరమునకు రూ. 1,60,000/- పొందవచ్చని మొదటి నాలుగు సంవత్సరాలు పంట రాని దశలో అంతర పంటల ద్వారా కూడా ఆదాయం పొందవచ్చు. ఆయిల్ పామ్ పెట్టిన 5 సంవత్సరాల తర్వాత చాక్లెట్ తయారు చేసే పంట ఐన కోకో పంటను కానీ, నీడని తట్టుకొని పెరిగే పంటల సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు రైతుల సందేహాలను నివృత్తి చేయడం జరిగినది.మెదక్ జిల్లాలో 2023-24 సంవత్సరంలో 78 మంది రైతులు 336 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టడం జరిగినది. ఈ సంవత్సరం అనగా 2024-25 సంవత్సరానికి మెదక్ జిల్లాకు 2000 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటల సాగు చేయుటకు ప్రణాళికా చేసుకోవడం జరిగినది. ఇప్పటివరకు 1723 ఎకరాలకి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగినది. అందులోనుండి ఇప్పటివరకు 360 ఎకరాలు ఆయిల్ పామ్ తోటలు పెట్టించడం జరిగింది.కావున మెదక్ జిల్లాలోని రైతులు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన పెంచుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టి ఇతర పంటల కంటే అధిక దిగుబడి లాభం పొందవలసిందిగా కోరడం జరుగుచున్నది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన గాలిపేల్లి ( గడ్డం ) తిరుపతి..

**- నూతన చైర్మన్ ని సన్మానించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదాసు రేణుక...**
**- అంతర్గాం మండలం రైతులకు అండగా ఉంటాం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదాసు రేణుక**

**కరపత్రం రామగుండం జనవరి, 09:**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మురుమూరు గ్రామానికి చెందిన నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదాస్ రేణుక రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైనటువంటి గాలిపేల్లి (గడ్డం ) తిరుపతిని శాలువలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదాస్ రేణుక మాట్లాడుతూ మాపైన నమ్మకంతో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ గాలేపల్లి (గడ్డం) తిరుపతిని, చైర్మన్ గా, మడ్డి తిరుపతి గౌడ్ ని వైస్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దానిలో భాగంగానే



రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎన్నికై గాలేపల్లి (గడ్డం )తిరుపతిని మా రామగుండం డైరెక్టర్ల తరపున శాలువాలతో సన్మానించడం జరిగిందని, అలాగే రాబోయే కాలంలో అంతర్గాం మండలంలోని రైతులకు వ్యవసాయం విషయంలో , వ్యవసాయం కు సంబంధిత బ్యాంకు రుణాల విషయంలోగాని, బ్యాంకుల రుణమాఫీ విషయంలో గాని రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న మేము ముందుండి వారి సమస్యను ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ దృష్టికి తీసుకువెళ్లి రైతుల సమస్యను తక్షణమే పరిష్కారం చేస్తామని, నూతనంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఎన్నిక కాబడిన నన్ను మార్కెట్ కమిటీ చైర్మన్ గాలే పల్లి(గడ్డం) తిరుపతి శాలువతో సన్మానించడం గర్వకారణంగా ఉందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదాసు రేణుక తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతి గౌడ్ , గోలివాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొనగంటి సత్యనారాయణ, మంతెన మహేందర్, తోట ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసి కోల రామ్మూర్తి గౌడ్, మాదాసు శ్రీనివాస్ గౌడ్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే వ్యసనాలకు దూరంగా ఉండండి.

## ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్.

**కరపత్రం ప్రతినిధి,మెట్ పల్లి, జనవరి 9 .**

విద్యార్థులు చదువుకునే దశ నుండే వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం వేముల కుర్తి గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత వారో ఉత్సవాల పై అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా ఎస్సై అనిల్ మాట్లాడుతూ నేటి యువత, విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటించడం లేదని ఈ సందర్భంగా తెలియజేశారు. యువత, విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలనునివారించవచ్చని తెలియజేశారు. చెడు వ్యసనాలకు విద్యార్థులు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని, మైనర్ విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని ద్వి చక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని ఎస్సై అనిల్ సూచించారు. అలాగే ఫోన్లు మాట్లాడుతూ వాహనాలను నడపరాదని, మద్యం సేవించి నడపవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు కోదండపాణి,ఉపాధ్యాయులు, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# ఎరువుల దుకాణాల్లో కోరుట్ల ఏడిఏ ఆకస్మిక తనిఖీ





**కరపత్రం జనవరి 09**

మల్లాపూర్ మండలంలోని గుండంపెల్లి మొగిలిపేట అలాగే మండల కేంద్రమైన మల్లాపూర్లో వ్యవసాయ శాఖ కోరుట్ల ఏ డి ఏ దండ రమేష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు అలాగే మండలంలోని వరి మొక్కజొన్న చెరుకు పంటలు పరిశీలించారు తగు సూచనలు రైతులకు జారీ చేశారు ముఖ్యంగా వరి నారుమడి వరి ప్రధాన పొలంలో యాసంగి చివరిదమ్ములో ఏ ఏ మందులు వాడాలి ఎప్పుడు వాడాలి ఏ గుళికలు వాడాలి వివరంగా తెలియచెప్పారు ప్రస్తుత చలికాలంలో మొక్కజొన్న పంటను ఏ ఏ రకంగా సంరక్షించుకోవాలి సూచించారు ఇట్టి పర్యటనలో ఏ డి ఏ వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

**కరపత్రం నిజాంపేట్ ప్రతినిది...**

నిజాంపేట మండల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల పరిధిలోని, కే వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులు, బుజేందర్ లకు, శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ చేతుల మీదుగా గురువారం నాడు హైదరాబాదులోని మినిస్టర్



క్వార్టర్స్ లో బాధితులకు అందజేశారు. ఆంజనేయులుకు 17,500 , రూ, భుజెందర్ కు33,000 రూ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాస్త్ర చికిత్సలు చేయించుకున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం హర్షనీయంగా ఉందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దయాకర్ మాట్లాడుతూ మా గ్రామానికి చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించిన వైస్ చైర్మన్ కు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో బీబీపేట మాజీ ఎంపీపీ బాలమణి, మహిపాల్, పిట్ల రాజు ,డప్పు శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# కన్నతండ్రులు మరణించిన విద్యార్థులకు మల్లాపూర్ ఆదర్శ పాఠశాల బాసట



**కరపత్రం జనవరి 09**

మల్లాపూర్ మండల కేంద్రంలో అనతి కాలంలో జరిగిన ప్రమాదంలో ఒకరు గల్ఫ్ మృతిచెందగా మరొకరు మల్లాపూర్ లో ప్రమాదంలో మృతిచెందగా అట్టి యువకుల



కూతుర్లు చదువుతున్న మల్లాపూర్ మండల ఆదర్శ పాఠశాల వారి కుటుంబాలకు బాసటగా నిలిచింది వివరాల్లోకి వెళితే ఇటీవల గల్ఫ్ బస్సు ప్రమాదంలో మరణించిన మానాల అశోక్ కూతురు సాయి వర్షిని అలాగే మండల కేంద్రంలో జరిగిన బైక్ ప్రమాదంలో మరణించిన రాము నరసయ్య కూతురు నిఖిల ఇరువురు మల్లాపూర్ ఆదర్శ పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు ఇరు కుటుంబాలకు జరిగిన తీవ్ర విషాదాన్ని గుర్తించిన మల్లాపూర్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ఉమ్మడిగా కలిసి వారి వారి కుటుంబాలకు చెరొక 12000 రూపాయల ఆర్థిక సాయం అందించారు ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దొంతిసుభాష్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పులేరి రాము సంబంధిత బంధువులు పాల్గొన్నారు

# చేపల వేటకు వెళ్లి ఈత రాక యువకుడు మృతి

**కరపత్రం జనవరి 09**



గొర్రెపల్లి గ్రామానికి చెందిన నిదునూరి కార్తికు తండ్రి రాజం వయసు 14 సంవత్సరాలు తేదీ ఎనిమిదో తారీకు ఒకటో నెల 2025 రోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో చేపల వేటకై వెళ్లిన కార్తీక్ ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి తండ్రి రాజం చుట్టుపక్కల వారిని బంధువులను అతని స్నేహితులను ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభించలేదు గురువారం ఉదయం గ్రామానికి చెందిన కదుర్ల నరసయ్య వ్యవసాయ బావి వద్ద అతని చెప్పులు చొక్కా లభించగా బావిలో వెతికి అతని మృతదేహాన్ని బయటకు తీశారు చేపల వేటకు పోయి ఈత రాక ప్రాణాలు పోగొట్టుకున్నాడని అతని తండ్రి రాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు మల్లాపూర్ ఎస్ఐ కే రాజు తెలిపారు

# గనికి వెళ్తుండగా 16మంది కిడ్నాప్.. గుర్తుతెలియని ప్రాంతానికి తరలింపు..!

**ఇస్లామాబాద్ కరపత్రం**

పాకిస్థాన్ వరుస దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఒకవైపు వరుసగా ఆ దేశం భద్రతా సిబ్బందిని కోల్పోతోంది. మరోపక్క సామాన్య ప్రజలకు రక్షణ కల్పించలేని దుస్థితి నెలకొంది. తాజాగా అక్కడ 16 మంది కూలీలు అపహరణ కు గురయ్యారు.

ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లో యురేనియం, ప్లూటోనియం గనిలో పనిచేస్తోన్న 16 మంది కూలీలను కొందరు సాయుధులు అపహరించారు. వారు లక్కీ మార్వత్ జిల్లాలోని అటమిక్ ఎనర్జీ మైన్ వద్దకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తర్వాత కూలీలను గుర్తుతెలియని ప్రదేశానికి తరలించిన అనంతరం వారు



ప్రయాణించిన వాహనాన్ని నిందితులు తగులబెట్టారు. అయితే ఈ కిడ్నాప్‌నకు పాల్పడింది ఎవరో తెలియాల్సి ఉంది. ఇంతవరకు ఏ గ్రూప్ బాధ్యత ప్రకటించుకోలేదు. నిషేధిత ఉగ్రసంస్థ ఉగ్ర సంస్థ తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ ఈ ప్రాంతంలో చురుగ్గా ఉంది. దీనికి ఆల్‌ఖైదాతో సంబంధాలున్నాయన్న ఆరోపణలున్నాయి. పాకిస్థాన్‌లో జరిగిన పలు ఉగ్ర ఘటనల వెనక ఈ గ్రూప్ హస్తం ఉంది. ఈ దాడుల నేపథ్యంలో ఖైబర్ పఖ్తుంఖ్వా హోంశాఖ గత ఏడాది ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మరోపక్క, ఇటీవల పాకిస్థాన్ సైన్యంపై బలోచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ) భారీ ఆత్మాహుతి దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. దాంతో పాక్ పదుల సంఖ్యలో సైనికులను కోల్పోయింది.

## మానవత్వంపై సోరస్‌కు ద్వేషం: మస్క్ విమర్శలు..!



**కరపత్రం డెస్క్**

జార్జిసోరస్ మానవత్వాన్ని ద్వేషిస్తారని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఘాటుగా విమర్శించారు. హమాస్‌కు మద్దతు ఇచ్చే ఎన్‌జీవోలకు సోరస్ నుంచి నిధులు వెళ్లినట్లు ఇజ్రాయెల్ ఐరాస రాయబారి గతంలో చేసిన ఆరోపణలకు సంబంధించి ఓ న్యూస్ రిపోర్టును పోస్టు చేశారు. దీనిలో సోరస్ నెట్‌వర్క్‌లోని ఎన్‌జీవోల నుంచి దాదాపు 15 మిలియన్ డాలర్ల సొమ్ము హమాస్‌కు మద్దతు ఇచ్చే గ్రూపులకు వెళ్లినట్లు ఉంది. నాడు ఈ విషయాన్ని ఐరాసలో ఇజ్రాయెల్ రాయబారి గిలియడ్ ఎర్డాన్ ఆరోపించారు.

జార్జిసోరస్-ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు మరింత పెరుగుతున్నాయి. సోరస్ కొన్నేళ్లుగా సంప్రదాయవాద నేతలకు లక్ష్యంగా మారారు. గతేడాది మస్క్ ఆయన్ను విమర్శించారు. నాడు ఎక్స్‌మెన్ కామిక్ పుస్తకాల్లోని మాగ్నెటో అనే పాత్రతో పోల్చారు. ఇటీవల సోరస్‌కు అమెరికాలో ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అవార్డు ఇవ్వడాన్ని టెస్లా సీఈవో తప్పుపట్టిన విషయం తెలిసిందే. అది అవార్డ్‌ను అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు. అంతేకాదు.. సోరస్ తన అసలు లక్ష్యాలను దాచిపెట్టి.. ఓ దాతగా ఇమేజ్‌ను పెంచుకొంటారన్న ఉద్దేశం వచ్చేలా .. స్టార్ వార్స్‌లో ఓ దుష్టపాత్రతో పోలుస్తూ మీమ్‌ను కూడా పోస్టు చేశారు. ఇటీవల కాలంలో భారత పార్లమెంట్‌లో కూడా సోరస్‌పై భాజపా-కాంగ్రెస్ మధ్య పెద్ద దుమారమే చెలరేగింది. ఓసీసీఆర్‌పీ నివేదికల వెనుక కూడా అతడి హస్తం ఉందన్న ఆరోపణలు వెలువడ్డాయి.

# అలా జరిగితే.. బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై బాంబింగ్‌కు ఇజ్రాయెల్ ప్లాన్..!

**కరపత్రం డెస్క్**

లెబనాన్ అంతర్జాతీయ విమానాశ్రయంపై బాంబింగ్ చేసేందుకు ఇజ్రాయెల్ ప్లాన్ చేసినట్లు సౌదీ మీడియా చెబుతోంది. ఇంటర్నెట్‌డెస్క్: ఇరాన్‌కు చెందిన ఖుద్స్ ఫోర్స్ నుంచి హెజ్‌బొల్లాకు మిలియన్ల డాలర్లు అందకుండా చేసేందుకు ఇజ్రాయెల్ దళాలు ఏకంగా బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనే బాంబింగ్ చేసేందుకు ప్లాన్ చేశాయట. ఈ విషయాన్ని సౌదీ అరేబియా ప్రభుత్వ రంగ ఛానల్ 'అల్ అరేబియా' కథనంలో పేర్కొంది.

వాస్తవానికి గత గురువారం ఇరాన్ మిలియన్ల డాలర్ల సొమ్మును హెజ్‌బొల్లాకు అందజేసేందుకు ప్లాన్ చేసినట్లు సౌదీ పత్రిక అల్ హదాత్ పేర్కొంది. టెహ్రాన్ నుంచి డబ్బు తీసుకెళ్లేందుకు 'మహన్ ఎయిర్' విమానం వినియోగించాలని వ్యూహరచన చేసింది. ఈ విషయం లెబనాన్‌కు తెలిసింది. ఆ మర్నాడే కొందరు ఇరాన్ అధికారులు మహన్ ఎయిర్ ఫ్లైట్‌లో బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యారు. వెంటనే విమానం మొత్తాన్ని భద్రతా సిబ్బంది తనిఖీ చేశారు. వారి లగేజీని చెక్ చేయడానికి లెబనాన్



భద్రతాధికారులు ప్రయత్నించగా.. ఇరాన్ అధికారులు ప్రతిఘటించారు. కానీ, లెబనాన్ సిబ్బంది మాత్రం తనిఖీలు చేసి కొన్ని అనుమానాస్పదమైనవి, సొమ్ములను స్వాధీనం చేసుకొన్నారు.

దీనిపై ఆ విమానంలో వచ్చిన ఇరాన్ దౌత్య ప్రతినిధి మాట్లాడుతూ.. తమ బ్యాగుల్లో కొన్ని పత్రాలు, ఎంబసీ నిర్వహణ ఖర్చులకు చెల్లించేందుకు సొమ్ములు ఉన్నాయని పేర్కొన్నారు. మరోవైపు లెబనాన్ మంత్రి బస్సమ్ మలావి మాత్రం ఆ రోజు సాయంత్రం వరకు ఎయిర్ పోర్టు నుంచి వచ్చే ప్రతి ఒక్కరికి తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. నగదు లేకపోవడంతో ఎయిర్ పోర్టుపై బాంబింగ్ ప్లాన్‌ను ఇజ్రాయెల్ పక్కనపెట్టినట్లు తెలుస్తోంది.

అక్టోబర్ 2024 నుంచి లెబనాన్ ఆర్మీనే స్వయంగా బీరుట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తనిఖీలు చేస్తోంది. గతంలో ఈ ఎయిర్ పోర్టును హెజ్‌బొల్లా ఆధీనంలో పెట్టుకొని ఆయుధాలు, నగదు స్మగ్లింగ్‌కు వాడుకొంటోందని చాలా మంది రాజకీయ నాయకులు కొన్నేళ్లుగా అసంతృప్తితో ఉన్నారు.

**లెబనాన్‌లో అధ్యక్ష ఎన్నిక..**

లెబనాన్ పార్లమెంట్‌లో అధ్యక్ష ఎన్నిక ప్రయత్నాలు జోరందుకొన్నాయి. మాజీ అధ్యక్షుడు మైఖేల్ ఔన్ స్థానంలో కొత్త వ్యక్తిని ఎన్నుకోవడానికి గత రెండేళ్లలో 12 సార్లు యత్నించినప్పటికీ సాధ్యపడలేదు. ప్రస్తుతం అధ్యక్ష రేసులో ఆర్మీ కమాండర్ జోసఫ్ ఔన్ ముందంజలో ఉన్నారు. అమెరికా, సౌదీకి అత్యంత సన్నిహితుడిగా అతడికి పేరుంది. ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య జరుగుతున్న యుద్ధం నుంచి కోలుకొని దేశ పునర్నిర్మాణం చేయాలంటే అతడి ఎంపిక చాలా అవసరం ఉంది.

## లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు.. అమెరికాకు సాయం చేస్తాం: ట్రూడో



**కరపత్రం డెస్క్**

లాస్ ఏంజెలెస్‌లో వ్యాపిస్తున్న మంటలను కట్టడి చేసేందుకు అమెరికాకు సాయం అందిస్తామని కెనడా ప్రధాని ట్రూడో పేర్కొన్నారు. ఇంటర్నెట్‌డెస్క్: 'కెనడా 51వ రాష్ట్రం'పై అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో మధ్య వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో లాస్‌ఏంజెలెస్‌లో వ్యాపిస్తున్న కార్చిచ్చును అదుపు చేసేందుకు అగ్రరాజ్యానికి సాయం అందిస్తామని ట్రూడో పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు.

'కాలిఫోర్నియాలో వ్యాపిస్తున్న మంటల కారణంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. కెనడియన్లు అక్కడ ఉన్న ప్రతిఒక్కరి గురించి ఆందోళన చెందుతున్నారు. ఈ కార్చిచ్చులు మాకేమీ కొత్త కాదు. కాలిఫోర్నియా అనేకసార్లు మాకు సాయం చేసింది. కెనడియన్ వాటర్ బాంబర్లు ఇప్పటికే సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. మా పొరుగుదేశమైన అమెరికాకు మరిన్ని వనరులను అందించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని ట్రూడో రాసుకొచ్చారు. కెనడాను 51వ రాష్ట్రంగా చేరాలంటూ ట్రంప్ పలుమార్లు ప్రతిపాదించారు. ట్రూడో రాజీనామా ప్రకటన అనంతరం ఆ ప్రతిపాదనను మరోసారి లేవనెత్తారు. అందుకు అవకాశమే లేదని కెనడా ప్రధాని ఇప్పటికే స్పష్టతనిచ్చారు. ఈ అంశంపై వివాదం కొనసాగుతున్న వేళ.. అమెరికాకు సాయం చేస్తామంటూ ట్రూడో ముందుకురావడం గమనార్హం.మరోవైపు.. లాస్‌ఏంజెలెస్ కార్చిచ్చు గురువారం హాలీవుడ్ హిల్స్‌కు వ్యాపించింది. మొత్తంగా 2,000 నిర్మాణాలు దగ్ధమైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు మొత్తం ఆరుచోట్ల కార్చిచ్చు వ్యాపించినట్లు అధికారులు గుర్తించారు. 50 బిలియన్ డాలర్ల (రూ.4.2 లక్షల కోట్లు) సంపద కాలి బూడిదైందని అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. 1700 మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. మరో 7,500 మంది సిబ్బందిని కాలిఫోర్నియా సిద్ధం చేసింది.

# కెనడాలో నిజ్జర్ హత్య కేసు.. ఆ నలుగురు భారతీయులకు బెయిల్

**కరపత్రం డెస్క్**

కెనడాలో నిజ్జర్ హత్య కేసులో అరెస్టయిన నలుగురు భారతీయులకు బెయిల్ లభించింది.

ఇంటర్నెట్ డెస్క్: ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటనతో భారత్, కెనడా ల మధ్య దౌత్య విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ కేసు పై దర్యాప్తు చేపట్టిన టొరంటో పోలీసులు.. గతేడాది నలుగురు భారతీయులను నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేశారు. తాజాగా వారికి బెయిల్ మంజూరైంది.

నిజ్జర్ కేసు లో ఫస్ట్ డిగ్రీ అభియోగాలపై కరణ్ బ్రార్, కమల్ ప్రీత్ సింగ్, కరణ్ ప్రీత్ సింగ్, అమర్‌దీప్ సింగ్‌ను గతేడాది మే నెలలో కెనడా పోలీసులు అరెస్టు చేశారు. భారత్ కు చెందిన వీరిలో ముగ్గురు ఎడ్మంటన్ ప్రాంతంలో నివసిస్తుండగా.. అమర్‌దీప్ బ్రాంప్టన్ వాసి. గత కొన్ని నెలలుగా జైల్లో ఉన్న వీరికి కెనడాలోని దిగువ కోర్టు తాజాగా బెయిల్ మంజూరుచేసింది. అనంతరం ఈ కేసు విచారణను బ్రిటీష్ కొలంబియా సుప్రీంకోర్టుకు




బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. దీనిపై ఫిబ్రవరి 11న తదుపరి విచారణ జరగనుంది.మరో వివాదంలో దక్షిణ కొరియా అధ్యక్షుడు.. థీసిస్‌ను దొంగిలించిన సతీమణి..! ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023 జూన్‌లో బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటన వెనక భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ అప్పట్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. వాటిని సమర్థించే ఆధారాలు ఇవ్వాలని.. ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని పలుమార్లు స్పష్టంగా చెప్పింది.

అయినప్పటికీ కెనడా మాత్రం ఆరోపణలు చేయడం మానలేదు. ఈక్రమంలోనే నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ పేరును చేర్చడంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సంజయ్‌వర్మ సహా ఆ దేశంలోని మన దౌత్యవేత్తలను భారత్ వెనక్కి రప్పించింది. అదే సమయంలో దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలన్న నిర్ణయం తీసుకుంది. దీంతో ఒట్టావా కూడా మన దౌత్యవేత్తలపై బహిష్కరణ వేటు వేసింది.

# మరో వివాదంలో దక్షిణ కొరియా అధ్యక్షుడు.. థీసిస్‌ను దొంగిలించిన సతీమణి..!

**కరపత్రం డెస్క్**

ఎమర్జెన్సీ వివాదం నేపథ్యంలో అభిశంసనకు గురై, అరెస్టు ముప్పు ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ కు సతీమణి రూపంలో మరో తంటా వచ్చి పడింది..! మాస్టర్ థీసిస్‌ను దొంగిలించి యూనివర్సిటీకి సమర్పించారంటూ ఆయన సతీమణి కిమ్ కియోన్ హీపై అభియోగాలు నమోదయ్యాయి. ఈమేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 2022 నుంచి సూక్‌మ్యూంగ్ మహిళా యూనివర్సిటీ దీనిపై విచారణ చేస్తోంది. కిమ్ తప్పుడు నివేదిక సమర్పించిన విషయం వాస్తవమేనని తాజాగా గుర్తించింది.కాగా, ఈ ఆరోపణలపై స్పందించడానికి ఆమెకు ఈ నెలాఖరు వరకు సమయం ఉంది. ఈలోపు ఆమె స్పందిస్తే.. ఆమె అభ్యర్థనను పరిశీలిస్తామని యూనివర్సిటీ వెల్లడించింది. లేకపోతే తాము కనుగొన్న తుది ఫలితాలను ప్రకటిస్తామని తెలిపింది.

గతంలోనూ ఆమె అందుకున్న ఓ కానుక అధ్యక్షుడిని చిక్కుల్లో పడేసింది. దేశ రాజకీయాలను కుదిపేసిన ఆ కుంభకోణం ఆయన ప్రతిష్ఠను మసకబార్చింది. కిమ్ కియోన్ హీ రెండేళ్లక్రితం ఓ పాస్టర్ నుంచి ఖరీదైన డియోర్ బ్యాగ్ ను గిఫ్ట్‌గా అందుకున్నారు. దాని విలువ 2,250 డాలర్లు ఉంటుందని (భారత కరెన్సీలో దాదాపు రూ.1.9 లక్షలు) అంచనా. ఉత్తర కొరియాపై అధ్యక్షుడి కఠిన వైఖరిని తీవ్రంగా వ్యతిరేకించే పాస్టర్ చాయ్ జే యంగ్ దీన్ని ప్రథమ మహిళకు కానుకగా ఇచ్చారు. దీనికి సంబంధించిన దృశ్యాలు 2023 నవంబరులోనే వెలుగులోకి వచ్చాయి. ద.కొరియా చట్టాల ప్రకారం.. ఒకేసారి 750 యూఎస్ డాలర్లు లేక ఒక ఏడాదిలో 2,200 డాలర్ల విలువైన బహుమతులను స్వీకరించడం చట్టవిరుద్ధం. దాంతో ఈ అంశం అక్కడి రాజకీయాలను కుదిపేసింది.



## లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు.. బైడెన్ కుమారుడి ఇల్లు దగ్ధం

**కరపత్రం డెస్క్**

అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌నుకార్చిచ్చు చుట్టుముట్టింది. వేలాది ఎకరాల్లోని విలాసవంతమైన ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఈనేపథ్యంలోనే అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ కుమారుడి ఇల్లు సైతం కాలి బూడిదైనట్లు తెలుస్తోంది. మాలిబులో జోబైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ ఇల్లు ఉంది. ఈ మంటల్లో అది కాలి బూడిదైనట్లు తెలుస్తోంది. పలు అంతర్జాతీయ మీడియాలో ఈమేరకు కథనాలు వెల్లడించాయి. ఇంటిముందు ఉంచిన కారు సైతం కాలిపోయిందని రష్యన్ టెలివిజన్ తెలిపింది. ఈవిషయంపై తనకు సరైన సమాచారం లేదని జో బైడెన్ విలేకరులతో పేర్కొన్నారు. మూడు గదులు కలిగిన ఈ లగ్జరీ ఇంటిని 1950లో నిర్మించినట్లు తెలుస్తోంది.మరోవైపు.. లాస్‌ఏంజెలెస్ కార్చిచ్చు గురువారం హాలీవుడ్ హిల్స్‌కు వ్యాపించింది. మొత్తంగా 2,000 నిర్మాణాలు దగ్ధమైనట్లు లెక్కలు చెబుతున్నాయి. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు మొత్తం ఆరుచోట్ల కార్చిచ్చులు వ్యాపించినట్లు అధికారులు గుర్తించారు. 50 బిలియన్ డాలర్ల (రూ.4.2 లక్షల కోట్లు) సంపద కాలి బూడిదైందని అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. 1700 మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. మరో 7,500 మంది సిబ్బందిని కాలిఫోర్నియా సిద్ధం చేసింది.